# మన ఇసుక మన వాహనంతో అనుమతులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

- **కలెక్టర్ సిక్తాపట్నాయక్**

నారాయణపేట టౌన్, అక్టోబర్ 18 : జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుక రవాణా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ లెవల్ స్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో గృహ అవసరాల నిమిత్తం ఇసుక కావాల్సిన వారు మన ఇసుక మన వాహనం ద్వారా అనుమతులు పొంది ఇసుకను తీసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో రెండు మూడు రోజుల్లో మన ఇసుక మన వాహనం ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 7 ఇసుక రీచ్‌లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మాగనూర్ మండలం వర్కూర్‌లో 3, మక్తల్ మండలం దాసర్‌దొడ్డిలో ఒక రీచ్ అందుబాటులో ఉందని, ఈ రీచ్‌ల్లో 65,554 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్లు తెలిపారు. మిగిలిన కొత్తపల్లి, లింగాల్‌ఛేడ్, నందిగామ, నాగిరెడ్డిపల్లి రీచ్‌ల్లో వర్షాల కారణంగా ఇసుక రవాణా సాధ్యం కాదన్నారు. ఇది వరకు ఉన్న ఇసుక విధానాన్ని స్టడీ చేసేందుకు సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని, ఇతర జిల్లాల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ ఇసుక రవాణా గురించి తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో మధుమోహన్, భూగర్భ జల వనరుల శాఖ అధికారిణి రమాదేవి, డీపీవో కృష్ణ, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ రంగారావు, తాసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ సస్పెన్షన్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 18 : మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ యాదయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజేయేందిరబోయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని కోయనగర్ పరిధిలో సాయి ఏఎల్ఎఫ్ స్వయం సహాయక సంఘాల్లోని రూ.1.49కోట్ల నిధుల గోల్‌మాల్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్పీ శ్రీలతపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేయాలని కలెక్టర్ మెప్మా అధికారులను ఆదేశించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

## సౌత్‌జోన్ పోటీలకు పురుషుల జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 18 : చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్, ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికకు శుక్రవారం పాలమూరు యూనివర్సిటీలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చాటిన విద్యార్థులను సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేసినట్లు పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పీయూ బ్యాడ్మింటన్ జట్టుకు పురుషుల విభాగంలో కొల్లాపూర్ హాసిని కాలేజ్ విద్యార్థి శ్రీరాములు, నారాయణపేట ఎస్సీఎస్‌ఎం కాలేజ్ జగదీశ్, విశ్వవికాస్ కళాశాల శివకృష్ణ, పాలమూరు యూనివర్సిటీ బడేసాబ్, రాకేష్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల పీడీ సత్యభాస్కర్‌రెడ్డి, పీడీ వెంకట్‌రెడ్డి, శారద, నరేశ్, మన్యం పాల్గొన్నారు.

### నేడు త్వైక్వాండో పోటీలు..

ఈనెల 19న శనివారం పీయూలో త్వైకాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 21న కబడ్డీ మహిళలు, పురుషుల జట్ల ఎంపికకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పీయూ, ఎంవీఎస్ పీడీలు, పీయూ అధ్యాపకులు























